ఎంతకాలం కళ్ళుమూసుకున్నా యేమీ జరగలేదు. కళ్ళు తెరిచారు. గదిలోవాళ్ళు బిడ్డని చూపరు, మాట్లాడరు.

చివరకి తీర్థులువొచ్చి—

'నాకు తెలీకండా దేవికి ఏదో అపచారంజరిగింది. కనక అవతారం వుపసంహరించుకుంది. జపంచేసి కనుక్కుని చెపుతాను" అని మళ్ళీ కనపళ్లేదు. ఆ వూళ్ళో చివరికి పుట్టినపిల్లని చూస్తే కదలడంలేదు. దానికి మొహమంతా గుంటలు. ఎవరో డాక్టరొకడుండి—"యిది సిఫిలిస్" 'పిల్లరా' అన్నాడు.

# ఎదగనే లేదు

గోదావరి యిసికలంకల వెనక సూర్యుడు అస్తమిస్తున్నాడు. నల్లని నీడమీాద, తెల్లనితెరచాప తేలిపోతోంది. వూళ్లోంచి బిందెపట్టుకుని ఒక అమ్మాయి మా రేవు వేపు వొచ్చింది. మమ్మన్ని చూసి కళ్ళుదింపి మీాతో నాకేమీా సంబంధంలే దన్నట్టు దూరంగా వొంపు తిరిగి రేవులోకి దిగింది. ఆమె వొళ్ళు సన్నం. యేళ్ళు పద్ధినిమిది వుండవు. కళ్ళల్లో బండీకి కట్టే యెద్దుకి వుండే 'యింక యీచాకిరీ, బాధా తప్పవనే' నిరాశతో కూడిన దీనమైన చూపు వొళ్లంతా జాతవలె కిందికి వేళ్లాడిపోయింది. అంత సన్నని వొళ్ళు అట్లా జారిపోతే, చాలా అసహ్యం వేస్తుంది; ఎంత అన్యాయం జరిగిందో అని, విచారం కలుగుతుంది. బిందెలో నీళ్ళుముంచి, యెత్తబోయి ఆయాసపడి, కళ్ళు కిందికివాల్చి నుంచుంది. ఎవ

రన్నా ఆడవాళ్ళు వొస్తున్నారేమోనని చూసింది. ఎవరని అలలు బిందెని ప్రశ్నిస్తున్నాయి. రామ్మూర్తి మెల్లిగా లేచి బిందె పట్టుకుని ఆమె బుజానికెత్తబోయినాడు. కాని ఆమె చప్పున పక్కకు తిరిగింది, • బిందె నక్కడే పెట్టి వెనక్కివొచ్చి కూచున్నాడు. ఆమె అభిమానం యెక్కువై ముందు ఆనీళ్లన్నీ పారపోసింది. మాకు కులం లేదని తెలుసునా అనుకున్నాను. మళ్లీ ముంచుకుని, కష్టపడి మోకాలుమీాద మోపుకుని, ప్రయత్నించి బుజాని కెత్తుకుంది. ఆబిందె బరువు కింద యే నిమిషాన ముద్దగా కూలుతుందో అనిపించింది నాకు.

సూర్యుడు బ్రిడ్జి వెనకాల ఇసికదిన్నెలలో అస్తమిస్తున్నాడు, నీటికాకులు మా నెత్తిమీాదిగా యెగిరిపోతున్నాయి. నిరాశలో గోదావరినీళ్ళు వుద్ధున తపుకుమని కొట్టుకుంటున్నాయి. మా హృదయాల్లో చెప్పలేని భీతితో కూడిన దిగులు కలిగింది, జీవితంలోని నిరాశలూ, నిష్ప్రయోజనమూ, కష్టమూ, అంధకారమూ, అన్నీ మనసుల నావరించాయి.

వుండుండి రామమూర్తి,

"వాణ్ణేంచెయ్యాలంటావు?" అన్నాడు. ప్రేమించి ప్రేమించి, ఒకరవ్వ సాఫల్యము నెరగక అట్లానే చచ్చిపోయినవాళ్ల గంభీరమైన బాధనిగురించి యోచిస్తున్న నా మనస్సుని తిప్పి, నేను

"యెవర్ని?" అన్నాను.

"ఆ అమ్మాయిని యీవిధంగా చితకకొట్టిన రాక్షసుణ్ణి"

"వెనిమిటి నేనా?"

"మూడేళ్ళల్లో చూడు, ఆఅందాన్నంతా—ఆ...అం... దా...న్నం... తా ... ఆ లావ...ణ్యాన్ని ... కోమ... లత్వా...న్ని..."

"ఎరుగుదువా యేమిటి?" •

రామ్మూర్తి నామాట వినిపించుకోలేదు. అతని దృష్టి యెక్కడో జ్ఞాపకంలో వుంది.

"బడినించి నవ్వుతో పరిగెత్తుతో వెడుతోండేది, లేడి పిల్లలాగు- గంతులేస్తో, నవ్వుతో, యిటూ అటూ సంతోషంగా చూస్తో,...పైకెతిరిగిన చిన్న ముక్కూ-అమాయకపు చిన్ననోరూ-

"ఆ పిల్లేనా, యీమె!"

"ఎదిగింది చక్కగా కోమలంగా యెదిగింది. మామిడి గున్నలాగు పెద్ద జుట్టు- నున్నగా గుండ్రగా మెడ—జుట్టు ఆరబోసుకుంటే కనపడేది. ఆచేతులో! పాపం, పాపం అంత అందంగానూ పెరుగుతుం దనుకున్నాను. అట్లానే కలకల నవ్వుతోనే, ఎండలో నుంచోడమే వీధి వంక చూడ్డమే ఆనందమైనట్టు, చూసేది. యింకేం? అందుకున్నాడు వాడు! బతకగలడా ఆ మెని నలిపెయ్యకుండా? దేహాన్నే కాదు-ఆమె అందాన్ని, ఆనందాన్ని, మెదడుని, స్వేచ్ఛని జీవాన్ని, కొరుక్కుతిన్నాడు. పీల్చాడు, పిప్పి చేశాడు. అయ్యో! ఆ హృదయాన్ని, కత్తితో పెల్లగించి తినేశాడు. ఆ కళ్ళలో ఆ శూన్య దృష్టిని, నిరాశని, భీతిని, చూశావా? ఏంచెయ్యను వాణ్ణి?"

"లేవతీసుకుపోదాం" అని నాకు తెలిసిన ఒక్క-సూత్రాన్ని అనేశాను.

"ఎవర్ని ?"

"ఈ మెని."

"ఎందుకు ?"

"వాడు మేడ్చి చచ్చేందుకు."

"చాలా సంతోషిస్తాడు. ఇక యీ మె యెందుకు వాడికి! ఇంకెవర్ని పట్టి చీల్చుకు తింటున్నాడో! రాక్షసుడు! ఈ శవమెందుకు వాడికి ?"

రామ్మూర్తి కోపంతో లేచాడు.

"వాడి కేమధికారంవుంది, అందాన్ని యిట్లా నాశనం చెయ్యడానికి! ఒక మంచిపటాన్ని చింపితే తంతారే, బతికివుండి, హృదయముండి, రోజురోజు కొత్తగామారే ఆమె సౌందర్యాన్ని—యేచట్టప్రకారమూ ఏమీ చెయ్యరూ? హృదయము చీల్చుకుతింటే యేమీ చెయ్యరూ! గొంతుక పిసికితే వురితీస్తారే ? . . . కలవకాడ నీళ్లలోంచి కాంతివేపు వెంపుతిరిగినట్టు వుండేది ఆమె మెడ, ఆయవ్వనం మొదలు పెట్టినప్పుడు మెలిపెట్టాడు, తుంపాడు, దరిద్రుడు—"

సూర్యుడు అస్తమించినచోట యెర్రగావుంది. గోదావరినీటిమీద నలుపుకమ్మింది. నల్లని కాళినాలుకలవలె నీళ్లు వొడ్డుని కోపంతో నాకుతున్నాయి.

నాలుగురోజుల తరవాత గోదావరి వొడ్డున ఆచోటనే శవంచుట్టూ మనుషులు కూడారు సాయంత్రం. గుంపులోకూడి దూరి, చూసివెచ్చాడు రామ్మూర్తి. మొహం అంతా తెల్ల

బడ్డది. కళ్ళుమాత్రం మెరుస్తున్నాయి చేతులూ పెదిమలూ వొణుకుతున్నాయి.

"అదే ఆపిల్తే, చంపారు. చంపాడు"

అంటూనే ఆగుంపుని నెత్తికి ఒకడిమీద దృష్టినిలిపాడు: రాక్షసుణ్ణో, ఘాతకుణ్ణో చూసినట్లు చూస్తూ, చిన్నకళ్లు పెద్దవి చేసి, నా చెయ్యి గట్టిగా పట్టుకుని,

"వాడే, వాడే" అన్నాడు.

"ఎవరు?"

"దాని మొగుడు."

ఇంక ఆలస్యమైతే యింకో హత్య జరుగుతుందని భయపడి, బలవంతంగా అతన్ని లాక్కుపోయి దూరంగా యిసిక మీద కూచోపెట్టాను.

దాహమై వచ్చిన గబ్బిలం సొమ్మసిలి నీళ్ళమీద పడి తన్నుకుంటోంది. నెత్తిమీద యెగిరిపొయ్యే నీళ్ళకాకి జాలిగా అరిచింది. నలుపు రెండోవొడ్డుని మింగేసింది.

ఒక్క మాట మాట్లాడ్డంకూడా సహించని దిగులులో యిద్దరమూ కూచుని వున్నాము.

శవంచుట్టూ వున్న గుంపు చెదిరిపోయింది. మసకలో ఒకమనిషి అల్లా నడుస్తూ మావేపు వచ్చి, మాకు కొంచెం దూరంలో కూచున్నాడు. రామ్మూర్తి చప్పున తలెత్తి అతన్ని చూసి

"ఎందుకు చంపావు?" అని అడిగాడు.

"నేనే చంపానా?" అన్నాడు అతను, మాతోకాక, తనని తనే ప్రశ్నించుకున్నట్టు.

"నువ్వే! ముమ్మాటికీ నువ్వే! ఈలోకంలో నీకు శిక్ష పడక పోవొచ్చు..."

"నేనేనా! నేనే ఐతే శిక్షపడతాను. పడనుమరి! ఇంకా సందేహిస్తావేం?—"

రామ్మూర్తి లేచాడు.

"ఏంచేశావు? చెప్పుముందు. ఏంచేశావు? నీచేతులతో నువ్వేంతోశావా? ఆమెఅంతట ఆమె పడ్డదా, హింసించావా? దుర్మార్గుడా, పశువా?"

పెద్ద పోట్లాట జరుగుతుందని భయపడ్డాను. కాని తిట్లనీ, చివాట్లనీ లక్ష్యపెట్టే స్థితిలో లేడు అతను. ఆశ్చర్యంతో ప్రశ్నార్థకంగా నావంక చూశాడు. నేను రామ్మూర్తిని కూచోపెట్టాను. ఆ భర్త వాలకం చూస్తే భయంకన్న విచారం ఎక్కువలాగు కనపడుతోంది. అతను నిర్దోషిఅని అనుకున్నాను, అతనిమీద జాలి కలిగింది. సానుభూతి కోసం వెతుకుతున్న వాడివలె కనపడ్డాడు.

"ఇక్కడ వుండవద్దు ఛీ, పోదాం, రా" అంటున్న రామ్మూర్తిని లక్ష్యం చెయ్యక, ఆ భర్త పక్కన కూచుని-

"ఎందుకు చచ్చిపోయిందో తెలుసునా?" అనిఅడిగాను.

"తెలుసునో, తెలీదో, తెలీటంలేదు"

"తెలీదూ! ఎందుకు తెలుస్తుంది నీకు-" అని యింకా యేదో దూషించ బోతున్నాడు రామ్మూర్తి.

"నన్నెరుగుదురా! ఎందుకంత ఆగ్రహం!"

"ఎరుగుదునా! ఎరగాలా! ఆమెని పాపం, చిన్నపిల్లని, నలిపి, చీల్చి, పీల్చి, పీనిగనిచేసి, యింక వేరేచంపాలా?

నిజంగా చంపి తేనేం చంపకపోతేనేం? నీ మొహం చూస్తే నే పంచమహాపాతకాలూ చుట్టుకుంటాయి."

ఎవరమూ మాట్లాడకండా కూచున్నాము. నేను దయగా-

"ఎందుకు గోదావరిలో పడ్డది?" అన్నాను మళ్ళీ.

"పాద్దుణించి అందరూ నన్ను వ్రూదార్చినవారే. కాని అందరికీ మనసుల్లో నేనే చంపానని వున్నట్టుంది. నేనే కారణమని నమ్మకం. ఈయన యెవరో పైకి అన్నాడు. అంతే బేధం. కాని నేనే కారణమా అని ఆలోచిస్తున్నాను.—"

"ఇంకా ఆలోచించాలా! నువ్వు కాకపోతే యింకెవరు, ఆమె కళ్ళల్లోకి ఆ హృదయబేధకమైన చూపు తెప్పించింది?"

రామ్మూర్తి మాటల్ని లక్ష్యంచెయ్యక అతను చెపుతున్నాడు.

"మొదటినించీ మేము చాలా ప్రేమించుకున్నాము. ఆడవాళ్ళ వొంటిఅందమంటే నాకుచాలాతృష్ణ. ఇదిచాలా అందమైనది. కాని వికారరూపాన్ని నేను భరించలేను. అందాన్ని చూస్తే, అందాన్ని చేత్తోతాకితే, యింక నా వొళ్ళునాకు తెలీదు. దానికీ నామీద చాలా మోహం వుండేది."యువ్వనవుధృతంవల్ల, యింక మేము వొకర్ని వొకరం నలిపి, పీల్చి, రాత్రులు, పగలు యెంతో అనుభవించాము. అందు కోసమే ఒకరికోసం ఒకరం బతికాము. భోజనమూ, అనుభవమూ, శక్తిని పోగొట్టు కోడమూ, మళ్ళీ సంపాయించడమూ, యిట్లా రెండు మూడు సంవత్సరాలు బతికాము. కాని అది రెండునిమషాల్లా గుందినామనసులో. యెండాకాలపు రాత్రులు, జోరుమనే వాన

లో గదిలో మేము వెచ్చగా క్రీడించిన ఆనందాలు,ఒకరినొకరం గాఢంగా ప్రేమించి గాయపరచడం—అట్లాంటి ఆనందం జీవితానికల్లా ఒక్కసారే కలుగుతుంది. కాని క్రమేపీ అది నా చేతుల్లో నలిగి, వేళ్లాడిపోవడం, నా కళ్ళు గుర్తుపట్టాయి. నేను గట్టిగా వాడుకునే స్తలము ప్రతిదీ కృశించింది. వాడిపోయి ముడతలు పడ్డది. నేనుమాత్రం అట్లానే వున్నాను. నా శరీరం యింకా అందంగా తయారయింది. దాని ముద్దులలో కౌగిలింతలలో—"

"పశువా ?"

"నే నేంచేశాను ? దాని కోరికా నాకోరికా ఏకమైనాయి. కాని సృష్టి స్త్రీలయడల క్రూరమయింది. పువ్వులో అందం ఒక్క నిమిషంలో నశిస్తుంది. రాయి మెరువు అట్లానే వుంటుంది. మన మేంచేస్తాం ?"

"పెద్దవాడివి, ఆడదాని సౌందర్యాన్ని ధ్వంసం చెయ్యకూడదని తెలీదూ ?"

"ఎట్లా తెలుసు! మీరు చెప్పారా? ఎవరైనా వొద్దన్నారా?" మా మోహాన్ని చూసి, చాలామంది అసూయ పడ్డారు. ఇంతలో దానికి గర్భంకలిగింది. అదివరకు దానిచేతులు సన్నపడ్డా రొమ్ము కృశించినా, అద్దమువంటి దానిపొట్టనీ విల్లువంటి దాని నడుమువొంపునీ చూసి తృప్తిపడేవాణ్ణి. కాని ఆ నడుము సాగి, పొట్ట పెద్దదై, ఆ మొహంకూడా వాడేటప్పటికి, దానివంక చూడ్డమే కష్టమయింది. పూర్వపు ప్రేమతో నాదగ్గిరికి వొచ్చేది. కాని చూడలేక కళ్లు తిప్పుకునే వాణ్ణి. అది తాకితే జెర్రులుపాకినట్టుండేది. దాంతో

పడుకోవలసి వొస్తుందని, స్నేహితుల యిళ్ళల్లో వుండేవాణ్ణి తనమీద ప్రేమ పోయిందని యేడిస్తే యేమనను? పోయింది. ఇంక రాదు. తన తప్పేదమేమని అడిగేది. ఏముంది?"

"అంతా నీ తప్పేదమే." అన్నాడు రామమూర్తి. "నాదా? నాకెంతో దిగులేసేది. నాకు ఏడుపొచ్చేది దాన్ని అట్లా కష్టపెట్టడం. కాని ఏమీ చాతనయ్యేదికాదు. దాన్ని లాలించడం నా చివరికి సాధ్యంకాలేదు. చీదరించుకున్నాను. తిట్టాను, దాని మోహాన్ని భరించలేక, ఏమీ లేనిదే ఎవరో నాకు ముండలున్నారన్నాను. రెండురోజులు కోపంతో మూతి ముడుచుకుంది, నేను బతిమాలుకుంటానని అది అనుకుంటే, నన్ను వొదిలిందికదా అని నేను సంతోషించాను. కాని "పోనీ, క్షమించానం"టో వొచ్చింది. ఇంక భరించలేక తన్నాను- పోయింది- దాన్ని యెంతో హింసించాను. కాని యెంత ప్రయత్నించినా నాకు . ఆ అసహ్యం ఆగలేదు. ఆ గర్భిణీ స్త్రీని కొట్టటం ఎంత పేగులు తరుక్కుపోయినా, పశ్చాత్తాపం చూపానా, నన్ను పట్టుకుంటుందని భయం. అంత దుఃఖమూ లోపల అణుచుకుని, జాలిని చంపుకుని, కోపంగా కనపడేవాణ్ణి. ఒకనాటి రాత్రి, అది యెంత ప్రేమతో లేపినా, మాట్లాడకండా పడుకుంటే, పాపం, విసుకెత్తి,

"పోనీ, కొట్టండి. అదే బావుంటుంది" అంది. ఎంత యేడ్చానా రాత్రి! పూర్వపు ప్రేమ జ్ఞాపకం తెచ్చి యేడిపించేది! ఓహో మేము గడిపిన రాత్రులు, మాసరసాలు, మానవ్వులు! యేమైనా యో! దానిపాదాలదగ్గిర కూచుని "నువ్వు నా రాణివి. నా హృదయేశ్వరివి. ఈ బతుకంతా వెలిగించావు. నువ్వు

లేనిది ఒక్క నిమిషం బతకలేననడం జ్ఞాపకమొచ్చేది. ఏం చెయ్యనూ, "అన్నీ దొంగమాటలేనా," అని అది అడిగితే పేగులు తరుక్కుపొయ్యేవి. చివరికి ఒకవిధంగా దాన్ని వోదార్చాను. పురుడు కాగానే మళ్లా అందంగా వుంటుందనీ, ఆ గర్భిణినెలలలో మోహం ఆరోగ్యం కాదనీ చెప్పాను. నమ్మింది కొత్తసంతోషం వొచ్చింది. కలకలనవ్వింది. ఎంతో ప్రయత్నించినా దగ్గిరికి రాలేదు, అటుతరవాత.

ఒకనాటి రాత్రి దానికి నరాలు పట్టుకున్నాయి. మా అత్తా, దాని చెల్లెలూ, వొచ్చి పడుకున్నారు: రాత్రి అవసర మొస్తుందేమోనని, అదీ, దాని చెల్లెలూ పట్టెమంచంమీద పడుకున్నారు. దానిపక్కన కింద చాపేసుకుని మా అత్త పడుకుంది. కొంచెం దూరంగా కిటికీదగ్గిర నులకమంచంమీద నేను పడుకున్నాను. ఇదంతా యెందుకు చెపుతున్నానంటే అంతా కర్మ, కర్మ తోసుకువొస్తుంది. మనం బుద్ధిపూర్వకంగా చేసేది తక్కువ. మా గదికి ఒకటే కిటికీ. అది రోడ్డుమీదికి తెరుచుకుంటూంది. మూసుకుంటే గాలిరాదు. అందుకని దీపం లేకండా చీకట్లో పడుకోడం మామూలునాకు. రాత్రి దాహమై మెళుకువవొచ్చింది. చెంబుకోసం వెతుకుదామంటే మా అత్త మధ్య యెక్కడో పడుకునివుంది. పడుకున్నాను, కాని నిద్ర రాదు. అత్తని పిలిస్తే అది లేచి మళ్లీ మూలుగుతుందని భయం. నిద్రపోకపోతే మర్నాడు ఆఫీసులో నిద్రా, పోస్టుమాస్టరు కోప్పడ్డం, జ్ఞాపకమొచ్చి, లేచికూచ్చున్నాను.మంచం మెల్లిగా దిగి, నేలమీద జరుగుతో, చెంబుకోసం వెతికాను. ఇటూ అటూ తడిమాను. నా వూపిరి బిగ్గిరిగా నాకే వినబడుతోంది.

మా అత్తని తాకి యెక్కడ తడుముతానో అనిభయం. ఆమె యేమనుకుంటుందో, ఇట్లా అనుకుంటూ వుండగానే, నా చెయ్యి సరిగా గుండ్రని వెచ్చని, ఆమె రొమ్ముమీద పడ్డది. భయంతో వొణికాను. అరుస్తుందో, తిడుతుందో, కావలిసే చేశానంటుందో! చెయ్యి చప్పున తియ్యబోయినాను. ఆమె నా చెయ్యి సక్కడే పట్టుకుని ఆపింది. నిజంగా చెపుతున్నా, ఆమెమీద యెప్పుడూ అట్లాంటివుద్దేశం నాకు లేదు. ఆ నిమషానా యేమీ కోర్కె కలగలేదు. కాని ఆ అవస్థలో ఆమె చెయ్యిపట్టుకుంటే నే నేంచెయ్యను? నా వుద్దేశ్య మదికాదని యెట్లా చెప్పను? ఆమెమీద నాకు చాలా గౌరవం. అది గాక ఏమాత్రంమాట్లాడినా, వాళ్ళిద్దరూ వింటారు. ఆమర్నాడు మా అత్త ఆ గదిలోనే పడుకుంది. ఈసారి నన్ను లేపి తన పక్కమీదికి తీసుకువెళ్ళింది.

ఎవరితోనన్నా యీ వ్యవహారమంతా, యీ నా బాధనంతా చెప్పుకోవాలని యీ వార్త విన్నప్పణ్ణించి అనుకుంటూ. ఎవరితో చెప్పినా, చెప్పుతీసుకు కొడతారని భయం మీరేమనుకుంటున్నారో? యేమన్నా అనుకోండి తీరా చెప్పేశాను.

మాఅత్తతో చాలా సౌఖ్యపడ్డాను. నాచేతుల్లో నిండి పొయ్యేది. నాభార్య అందమే గాని, యెక్కడ గట్టిగా నొక్కితే విరుగుతుందో అనిపించేది. అప్పణ్ణించి అది యెదగనే లేదండి—"

"ఎవరితప్పు?" అన్నాడు రామ్మూర్తి పెంకెగా.

“ఇది కన్నది కన్నాక మళ్ళీ నాకోసం వొస్తే నాకేమి మనస్కరించలేదు. రోత అనిపించేది. మా అత్త ‘అమ్మాయీ’ బుల్లెమ్మా!” అంటే, నాకు అమ్మాయి లాగే కనిపించింది. ఎంతో ప్రయత్నించాను. చాతకాలేదు “ఇప్పుడు మునపటి మల్లేనే వున్నాగా!” అంది. దాంతో నా పేగులు తరుక్కుపోయి, యేడ్చాను. అది ప్రేమ అనుకుని, ప్రేమతో నన్ను సమీపించింది. ఆ రాత్రంతా అత్తదగ్గిరికి వెళ్దాం అని చూస్తున్నాను. భార్యకి దడిశి వారం రోజుల నుంచి ఆమెని చూడలేదు. గంటసేపు భరించాను. ఇంక ఊపిరాడ్డం దుర్భరమై దాన్ని ఒక్కతోపు తోసి, రెండుతిట్లుతిట్టి బైటికి వెళ్లాను. నా శరీరమంతా మలినమైనట్టు, ఏదో వికారమైన పాపం చేసినట్టు, తోచి, నన్నాగతికి యీడ్చిన దానిమీది కోపం పట్టలేక, వెనక్కి వెళ్ళి,

“ఈసారి నన్ను తాకావా నిన్ను చంపేస్తాను కుళ్ళు ముండా! నిన్ను చూస్తేనే డోకు,” అని వెళ్ళిపోయినాను. తెల్లారేప్పటికి చచ్చిపోయింది యీనదిలోపడి.

## ౮. భాషన్నా తెలీదు

“నేను కొవ్వూరులో పెద్దబోగీలో యెక్కాను. నిండా ప్రజలున్నారు. కూచోడానికి చోటు లేక తలుపు దగ్గిరిగా కూచున్న ఉత్తరహిందూస్తానంవాళ్ళని మూటలు తీసి జాగా చెయ్యమని సౌజ్ఞ చేశాను. తియ్యడానికి వీల్లేదని ఆపాడు